సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 29 । ఏప్రిల్ । 2025



నృత్యం.. కళారూపం

వివిధ నృత్యరీతుల్లో జిల్లా కళాకారులు రాణిస్తుండడమే కాక మరికొందరు పోటీల్లో సత్తా చాటేలా తర్ఫీదునిస్తున్నారు. 8లో



ప్రయాణికులకు చేరువగా..

ఆర్టీసీ ఆధునిక సాంకేతికత అందిపుచ్చుకుంటోంది. క్యూఆర్ కోడ్‌తో సేవలు అందిస్తూ వినియోగదారులకు చేరవవుతోంది. 8లో

గరిష్టం / కనిష్టం
40° / 26°

వాతావరణం

జిల్లాలో మంగళవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం మొదలయ్యే ఎండ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఇన్సులిన్ కొరతపై కలెక్టర్ ఆరా !

డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్‌ను వివరణ కోరిన పాటిల్

ఇల్లెందు : మధుమేహ బాధితులకు అందించే ఇన్సులిన్ మందు కొరతపై కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆరా తీశారు. సోమవారం సాక్షిలో 'ప్రభుత్వాస్పత్రుల్లో ఇన్సులిన్ కొరత' శీర్షికన కథనం ప్రచురితం కాగా, ఇందుకు గల కారణాలపై డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్‌ను వివరణ కోరినట్లు తెలిసింది. జిల్లాలో 5,12,321 మందికి ఎన్‌సీడీ పరీక్షలు నిర్వహించగా 44,306 మంది షుగర్ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఇందులో 20,160 మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కాయకల్ప ఆస్పత్రుల్లో సుమారు 1000 వాయిల్స్ ఉన్నా.. వాటి కాల పరిమితి జూన్‌తో ముగుస్తోంది. కనీసం మూడు నెలల గడువు ఉన్న మందులనే వాడాల్సి ఉండడంతో ఆ వాయిల్స్‌ను పక్కన పెట్టారు. రెండు నెలల గడువున్నా వాడొచ్చని డాక్టర్లు నిర్ధారిస్తే.. అవసరాన్ని బట్టి వాటిని ఆయా ఆస్పత్రులకు సరఫరా చేసే అవకాశం ఉంది. ఇక ఆయా ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న నిధులతో అవసరమైన మందులు కొనుగోలు చేసుకునే అవకాశం ఉన్నా.. కలెక్టర్ అనుమతి పొందాల్సి ఉంది. ఏదేమైనా ఇన్సులిన్‌తో పాటు బీపీ బాధితులు వాడే ఒక రకం మాత్రలు సైతం అందుబాటులో లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

కొత్తగూడెంఅర్బన్ : వేసవిలో వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు చేపడుతున్నామని ఎస్‌ఈ జి.మహేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గత నవంబర్‌లోనే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని వెల్లడించారు. విద్యుత్ లోడ్ పెరిగే అవకాశం ఉన్న గుండాల, మామకన్ను, ఆళ్లపల్లి, చర్ల మండలం సత్యనారాయణపురం 33/11 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. పాల్వంచ, దమ్మపేట మండలం మల్కారం, అంకంపాలెం, లింగాలపల్లి, అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచామని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 288 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, 52 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామని పేర్కొన్నారు. తద్వారా ఓవర్ లోడ్ ఇబ్బంది లేకుండా చేయగలిగామని తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, భద్రాచలం, బూర్గంపాడు, సారపాక, మణుగూరు, అశ్వారావుపేట, దమ్మపేట, చుంచుపల్లి, సుజాతనగర్, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, టేకులపల్లి, బొమ్మనపల్లి, లక్ష్మీదేవిపల్లి, జూలూరుపాడు మండలాల్లో ఓవర్ లోడ్ తగ్గించగలిగామని వివరించారు.

ఆదాయం ఉన్నా.. వసతులు సున్నా



బూర్గంపాడు మార్కెట్ ఆవరణలో ధాన్యం ఆరబోస్తున్న రైతులు (ఫైల్)

లక్ష్యాన్ని మించి ఆర్జిస్తున్న వ్యవసాయ మార్కెట్లు

- మౌలిక సదుపాయాలు లేక రైతుల ఇక్కట్లు
- పట్టించుకోని మార్కెటింగ్ శాఖ అధికారులు
- కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలంటున్న రైతులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో ఆరు వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులు పండించిన పంటలు అమ్ముకునేందుకు ఇవి వేదికలుగా ఉన్నాయి. పంటల క్రయవిక్రయాలతో మార్కెట్‌కు ఆదాయం వస్తోంది. గత ఆర్థిక సంవత్సరం ఆరు వ్యవసాయ మార్కెట్లకు కలిపి రూ. 21.60 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా, రూ.23.55 కోట్ల ఆదాయం వచ్చింది. ఆదాయం మెండుగా ఉన్నా వ్యవసాయ ఉత్పత్తులు సకాలంలో అమ్ముకోవడానికి, నిల్వ చేసుకోవడానికి అవసరమైన సదుపాయాలు మాత్రం కల్పించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రుణ సౌకర్యం లేక..

జిల్లాలో అత్యధిక భూములు 1/70 ఏరియా కిందే ఉన్నాయి. ఈ చట్టం పరిధిలో ఉన్న భూముల క్రయవిక్రయాలు గిరిజనుల మధ్య జరిగితేనే వాటికి చట్టబద్ధత ఉంటుంది. ఈ భూములను రుణాల రికవరీ పేరిట వేలం వేసేందుకు అవకాశం లేదు. దీంతో జిల్లా పరిధిలో రిజిస్ట్రేషన్ ఉన్న భూములు దొరకడం, బ్యాంకు రుణాలు మంజూరు కావడం కష్టంగా ఉంది. దీంతో ప్రైవేటు సెక్టార్‌లోనూ కోల్డ్ స్టోరేజీలు, రైస్ మిల్లులు, ఆధునిక వ్యవసాయ యంత్రాలు అందుబాటులోకి రావడం లేదు. వెరసి పంట ఉత్పత్తులు ఆరబెట్టుకోవడానికి, మంచి ధర వచ్చేంత వరకు నిల్వ చేసుకోవడానికి రైతులు పొరుగు జిల్లాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇది వ్యయప్రయాసలతో కూడిన వ్యవహారం కావడంతో చాలా మంది రైతులు కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకే అమ్ముతూ శ్రమ దోపిడీకి గురవుతున్నారు.

కోల్డ్ స్టోరేజీలు కూడా లేవు..

జిల్లాలో గోదావరి తీర ప్రాంతంలో మిర్చి పంట అధికంగా పండిస్తారు. మంచి ధర వస్తే అమ్మడం, లేదంటే ధర వచ్చే వరకు కోల్డ్ స్టోరేజీల్లో పంటను రైతులు నిల్వ చేస్తుంటారు. అయితే మిర్చిని కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేయాలంటే ఎక్కువ మంది ఖమ్మం, వరంగల్ నగరాలపై ఆధారపడాల్సి వస్తోంది. జిల్లాలో డిమాండ్‌కు తగిన స్థాయిలో కోల్డ్ స్టోరేజీలు అందుబాటులో లేవు. ఒకటి అరా ఉన్నా వాటి నిల్వ సామర్థ్యం తక్కువే.

జిల్లాలోని మార్కెట్ కమిటీల ఆదాయం వివరాలు (2025 మార్చి 31 వరకు)

మార్కెట్	ఆదాయం (రూ.కోట్లలో)
బూర్గంపాడు	6.50
ఇల్లెందు	5.75
కొత్తగూడెం	3.30
దమ్మపేట	3.90
భద్రాచలం	2.10
చర్ల	2.00
మొత్తం	23.55 (లక్ష్యం 21.69)

మార్కెట్లు ముందుకు వస్తేనే..

సాధారణ కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి ఎకరం స్థలంతో పాటు రూ.కోటి నుంచి రూ.2 కోట్ల వ్యయం అవుతుంది. రిజిస్టర్ భూములు లేకపోవడం, బ్యాంకు రుణాలు మంజూరు కాకపోవడంతో కోల్డ్ స్టోరేజీల నిర్మాణానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ సమస్యను అధిగమించాలంటే లాభాల బాటలో ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీలు ముందుకు రావాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్లకు అనుబంధంగా కోల్డ్ స్టోరేజీలు నిర్మిస్తే పంటలు నిల్వ చేసుకుని, మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకునే వెసులుబాటు ఉంటుందని, తద్వారా మార్కెట్లకు సైతం అదనపు ఆదాయం వస్తుందని చెబుతున్నారు.

పైలట్ ప్రాజెక్టుగా..

మిర్చి పంట అధికంగా పండే బూర్గంపాడు మార్కెట్ పరిధిలో పైలట్ ప్రాజెక్టుగా కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలని రైతులు కోరుతున్నారు. ఇది సానుకూల ఫలితాలిస్తే భవిష్యత్‌లో రైస్ మిల్లులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు కూడా పెట్టుకునే అవకాశం కలుగుతుంది. అలాగే ఇల్లెందు, కొత్తగూడెం మార్కెట్ల పరిధిలో కూరగాయల సాగు ఎక్కువగా ఉంది. కానీ అక్కడ కూడా కోల్డ్ స్టోరేజీలు లేక రైతులు తమ కష్టానికి తగ్గ ఫలితం పొందలేక పోతున్నారు.

భూ భారతి.. రైతులకు శ్రీరామ రక్ష



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు

- ఈ చట్టం నాలుగు గోడల మధ్య తెచ్చింది కాదు
- ఇప్పటికే 5.65 లక్షల దరఖాస్తుల పరిష్కారం
- గిరిజన ప్రాంత సమస్యలకు ప్రత్యేక కమిటీ
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

అశ్వారావుపేట: గత ప్రభుత్వ హయాంలో ధరణి ద్వారా రైతులకు వచ్చిన కష్టాలకు చెక్ పెట్టేందుకే భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ ఆవరణలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా గృహాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో రూ.37.5 కోట్లతో నిర్మించనున్న 100 పడకల భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులో మాట్లాడుతూ.. ఈ చట్టంతో రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని, ధరణిలా ఇది నాలుగు గోడల మధ్య కూర్చుని రూపొందించిన చట్టం కాదని చెప్పారు. ఇది రైతులకు శ్రీరామ రక్ష అని అన్నారు. తొలుత రాష్ట్రంలో నాలుగు గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి జూన్ 2 కల్లా ఆయా గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తామని, ఆ అనుభవంతో మిగిలిన చోట్ల కూడా అమలు చేస్తామని వివరించారు. ఆగస్టు 15 నాటికి చట్టాన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తామన్నారు. సమస్యను బట్టి తహసీల్దార్ నుంచి సీసీఎల్‌ఏ వరకు వెళ్లేలా డిజైన్ చేశామని తెలిపారు. సీసీఎల్‌ఏ వద్ద న్యాయం జరగకుంటే ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చన్నారు. ధరణి చట్టంలో 9.26 లక్షల రైతుల సమస్యలకు పరిష్కారం చూపకపోగా.. ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటు కాగానే 5.45లక్షల దరఖాస్తులను పరిష్కరించామన్నారు. రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులే గ్రామాలకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తారని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన, గిరిజనేతర రైతుల మధ్య సున్నిత సమస్యలు ఉన్నాయని, వీటి పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని.. త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో భూ సమస్యలను భూ భారతి చట్టంతో పరిష్కరించుకోవచ్చన్నారు. అశ్వారావుపేటలో 911, 512 సర్వే నంబర్ల సమస్యను ఇదే వేదికపై గతంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో ప్రస్తావించామని అన్నారు కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. భూభారతి ద్వారా రైతులకు నమ్మకం, ధైర్యం, రక్షణ కల్పిస్తామని చెప్పారు. పాస్‌బుక్ కావాలంటే మీసేవా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, భూ భారతి పోర్టల్‌లో రూ.300 చెల్లిస్తే పాస్‌బుక్ పొందవచ్చని తెలిపారు. సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీఓ మధు, హౌసింగ్ పీడీ శంకర్, తహసీల్దార్ వనం కృష్ణప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు. కాగా, మంత్రి పొంగులేటి హాజరైన ఈ కార్యక్రమానికి.. ప్రొటోకాల్ పాటించడంలో అధికారులు, రక్షణ బాధ్యతల నిర్వహణలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు వినిపించాయి. ఏ పదవీ లేకున్నా పలువురు కాంగ్రెస్ నాయకులు పోటీపడి వేదికపైకి రావడం విస్మయానికి గురిచేసింది. చోటా మోటా నాయకులను అడ్డుకోని పోలీసులు సాధారణ ప్రజలను మాత్రం లోనికి అనుమతించకపోవడంతో వారు నిరాశగా వెనుదిరిగారు. ఈ విషయమై తహసీల్దార్ కృష్ణప్రసాద్‌ను అడగగా.. 'మేం ఎవరినీ పిలవలేదు.. ప్రొటోకాల్ అంటూ లేకుండా ఎవరు పడితే వాళ్లు వచ్చేశారు' అన్నారు.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

దమ్మపేట : ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా సత్వర పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మండలంలోని మల్లారం రైతు వేదికలో భూ భారతి చట్టంపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ధరణి కంటే మేలుగా అనేక సమస్యలకు పరిష్కారం చూపే దిశగా ఈ చట్టం రూపొందించారని తెలిపారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు ముందు భూమి యొక్క సర్వే మ్యాప్‌ను తయారు చేసి, పట్టాదారు పాసుపుస్తకంలో భూమి పటం ముద్రించనున్నట్లు చెప్పారు. మ్యుటేషన్ ప్రక్రియలో పూర్తిస్థాయి విచారణ చేశాకే పట్టా పేరు మారుతుందని స్పష్టం చేశారు. ఒకే సర్వే నంబర్‌పై పలుమార్లు తప్పుడు రిజిస్ట్రేషన్లు జరగకుండా, ఆ భూమికి భూదార్ కార్డులను జారీ చేసి, సమస్యల పరిష్కారంలో రెండంచెల అప్పీలు వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ఇంటి స్థలాలు, వ్యవసాయేతర భూములకు కూడా భూ రికార్డుల్లో హక్కులు కల్పిస్తామన్నారు. మోసపూరితంగా పట్టా మార్పిడి జరిగితే వాటిని రద్దు చేసే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలోనూ గ్రామ పరిపాలన అధికారి ద్వారా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అధికారులు నిబద్ధతతో పనిచేసి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.వాణి, ఎంపీడీఓ రవీంద్రారెడ్డి, ఏఓ చంద్రశేఖర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్, పక్కన ఎమ్మెల్యే ఆదినారాయణ తదితరులు

స్పీడ్ బోట్‌లో షికారు ఎలా..?

మరమ్మతులకు నోచుకోని వైనం

పాల్వంచరూరల్ : కిన్నెరసాని జలాశయంలో స్పీడ్ బోట్‌లో షికారు చేసేందుకు ఎక్కువ మంది పర్యాటకులు ఆసక్తి చూపుతారు. కానీ నాలుగైదు రోజులుగా ఈ బోట్ పనిచేయకపోగా, మరమ్మతులపై అధికారులు దృష్టి పెట్టడం లేదు. దీంతో పర్యాటకులు నిరాశకు గురవుతున్నారు. తద్వారా పర్యాటకాభివృద్ధి సంస్థ ఆదాయం కూడా తగ్గింది. మామూలు రోజుల్లో పర్యాటకుల సంఖ్య కొంత తక్కువగా ఉన్నా.. ఆదివారం, సెలవురోజుల్లో మాత్రం రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా తరలివస్తుంటారు. ప్రస్తుతం విద్యాసంస్థలకు వేసవి సెలవులు రాగా, సందర్శకుల సంఖ్య కూడా పెరిగింది. ఈ సమయంలోనే స్పీడ్ బోట్ రిపేర్‌కు రావడంతో ఆదాయానికి గండి పడినట్లయింది. పెద్ద బోట్ ఒకటే నడవడంతో గత ఆదివారం రూ.6,270 ఆదాయం మాత్రమే లభించింది. అదే స్పీడ్ బోట్ కూడా నడిస్తే అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉంది. పెద్ద బోట్‌లో 20 మంది వరకు ఎక్కే అవకాశం ఉండగా ఒక్కొక్కరికి రూ.50 చొప్పున వసూలు చేస్తారు. అదే స్పీడ్ బోట్ ఆరుగురికే పరిమితమైనా.. ఒక్కో ట్రిప్‌నకు రూ.350 చార్జీ వసూలు చేస్తారు. ఇది వేగంగా జలాశయాన్ని చుట్టిరావడం, ఒక కుటుంబానికి చెందిన వారుంటే దీన్నే ఎక్కువగా ఇష్టపడతారు. కాగా, ఈ బోట్‌ను హైదరాబాద్‌లోని టూరిజం డెవలప్‌మెంట్ ప్రధాన కార్యాలయానికి పంపితే తప్ప రిపేర్ చేసే అవకాశం లేదు. కిన్నెరసాని నుంచి కార్గో పాయింట్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించాలంటే రూ.1500కు పైగా ఖర్చవుతుంది. బోట్ ఇంజన్ తరచూ మరమ్మతులకు గురవుతండగా రవాణా ఖర్చులే అధికమవుతున్నాయి. పైగా సమయం కూడా ఎక్కువవుతోంది. దీంతో పర్యాటక శాఖ అధికారులు స్పందించి స్థానికంగానే మెకానిక్‌ను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



రిపేర్‌కు వచ్చిన స్పీడ్ బోట్

ఉపాధి పథకాలకే దరఖాస్తులు ఇవ్వండి

గిరిజన దర్బాదర్‌లో పీఓ రాహుల్

భద్రాచలం : భద్రాచలం ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న స్వయం ఉపాధి పథకాలు, జీవనోపాధి తదితర సమస్యలపై మాత్రమే దరఖాస్తులు సమర్పించాలని, ఉద్యోగాల కోసం ఎవరూ ఇవ్వొద్దని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించి, అర్హతల మేరకు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలన్నీ నోటిఫికేషన్ ద్వారానే భర్తీ అవుతాయని, వాటి కోసం దర్బార్‌లో దరఖాస్తులు ఇవ్వొద్దని కోరారు. గిరిజన యువత, మహిళలకు స్వయం ఉపాధి పథకాలు, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఆర్చరీ విజేతలకు అభినందన..

వైజాగ్‌లోని గీతం యూనివర్సిటీలో ఇటీవల జరిగిన గిరిజన ఆర్చరీ క్రీడల్లో విజేతలతో పాటు కోచ్‌లు, ప్రోత్సహించిన అధ్యాపకులను పీఓ తన చాంబర్‌లో అభినందించారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, గిరిజన సంక్షేమ ఈఈ చంద్రశేఖర్, గురుకుల ఆర్‌సీఓ నాగార్జున రావు, ఏఓ సున్నం రాంబాబు, క్రీడాధికారి గోపాలరావు, వెంకటనారాయణ, నాగ శ్యామ్, వెంకటేశ్వర్లు, మారెప్ప పాల్గొన్నారు.



దర్బార్‌లో గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న రాహుల్

నిష్పక్షపాతంగా లబ్ధిదారులను ఎంపిక చేయండి..

రాజీవ్ యువ వికాస పథక లబ్ధిదారులను నిష్పక్షపాతంగా ఎంపిక చేయాలని పీఓ రాహుల్ అన్నారు. ఆర్‌వైవీ దరఖాస్తులపై ప్రత్యేకాధికారులతో సమీక్షించారు. గిరిజన నిరుద్యోగ యువత సమర్పించిన దరఖాస్తులను మండల్ లెవెల్ స్క్రీనింగ్ కమిటీతో పరిశీలించాలన్నారు. హాస్టళ్లు, పాఠశాలల్లో మరమ్మతుల ప్రతిపాదనలను తక్షణమే అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో సాంఘిక, బీసీ సంక్షేమాధికారులు అనసూయ, ఇందిర, ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓలు అశోక్ కుమార్, చంద్రమోహన్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.



రంగనాయకుల గుట్టపై ఉన్న భక్తరామదాసు ధ్యాన మందిరం



చెరిగిపోతున్న రామదాసు కీర్తనలు

ధ్యానమందిరంపై ధ్యాసేది..?



మందిరంలో ఉన్న కంచర్ల గోపన్న విగ్రహం

- నిర్వహణ లేక చెరిగిపోతున్న కంచర్ల గోపన్న కీర్తనలు
- భద్రాచలంలో నిరుపయోగంగా భక్తరామదాసు మందిరం
- భజన మందిరంగా తీర్చిదిద్దాలని భక్తుల విన్నపం

భద్రాచలం: భద్రగిరిలోని భక్తరామదాసు ధ్యానమందిరంపై అధికారులకు పట్టింపు లేకుండా పోతోంది. రామాలయ నిర్మాణ కర్త, ప్రముఖ వాగ్గేయకారుడు, భక్త రామదాసుగా పిలిచే కంచర్ల గోపన్నకు సముచిత స్థానం కల్పించేందుకు, ఆయన కీర్తనలకు ప్రాచుర్యం కల్పించేందుకు నిర్మించిన ఆలయం శిథిలమవుతోంది. 53 ఏళ్ల విశిష్టత ఉన్న ధ్యాన మందిరం క్రమంగా ఆదరణ కోల్పోతోంది.

సర్వేపల్లి రాధాకృష్ణన్‌తో శంకుస్థాపన..

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో కంచర్ల గోపన్న జ్ఞాపకార్థం రంగనాయకుల గుట్టపై ధ్యాన మందిరం నిర్మించారు. 1962 జనవరి 5న నాటి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ శంకుస్థాపన చేయగా, 1971, నవంబర్ 5న అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి ప్రారంభించారు. రెండు అంతస్తులతో మందిరం నిర్మించగా మొదటి అంతస్తులో రామదాసు రచించిన కీర్తనలను శిలాఫలాకలపై లిఖించి, వీటిని నాలుగు వైపులా గోడలపై ఏర్పాటు చేశారు. రామాయణ, భాగవత ఘట్టాల పెయింటింగ్ చిత్రాలను సైతం మందిరంలో ఏర్పాటు చేశారు.

శిలాఫలకాలు శిథిలం..

నిర్వహణ సక్రమంగా లేక ధ్యాన మందిరం ప్రస్తుతం నిరుపయోగ స్థితికి చేరింది. గతంలో రంగనాయకుల గుట్టపైనే సత్రాలు, కాటేజీలు ఉండటంతో భక్తులు సందర్శించేవారు. అనంతర కాలంలో వసతి గదులు, ప్రైవేట్ లాడ్జీలు గుట్ట కింది భాగంలో అందుబాటులోకి వచ్చాయి. ప్రారంభ కాలంలో భక్త రామదాసు వాగ్గేయకారోత్సవాలను ధ్యాన మందిరంపై జరిపేవారు. ప్రస్తుతం ఈ ఉత్సవాలను ఆలయం పక్కనే ఉన్న చిత్రకూట మండపంలో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ధ్యాన మందిరానికి భక్తుల ఆదరణ తగ్గిపోతోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడి కీర్తనల శిలాఫలకాలు కూడా దెబ్బతింటున్నాయి.

భక్తులను గుట్టపైకి రప్పించాలి..

ధ్యానమందిరం, రామదాసు కీర్తనల శిలాఫలాకలను పరిరక్షించాలని పలువురు భక్తులు కోరుతున్నారు. ప్రస్తుతం భక్త జన మండలి సభ్యులు, అంజన్న స్వామి భక్తులు అధిక సంఖ్యలో భద్రాచలం తరలివస్తున్నారు. వీరికి తగిన సదుపాయాలు కల్పించి ధ్యానమందిరంతో పాటు భజన మందిరంగా అవకాశం కల్పిస్తే మరింత ప్రాచుర్యం పొందే అవకాశం ఉంది. భక్తులు రామాలయం నుంచి గుట్టపైకి వచ్చేలా ప్రచారం, రవాణా సౌకర్యం కల్పిస్తే భక్త రామదాసు పేరు, కీర్తనలు కలకాలం వినపడతాయి.



క్లుప్తంగా

హెచ్‌డబ్ల్యూఓ అభ్యర్థులకు త్వరలోనే కౌన్సెలింగ్

భద్రాచలంటౌన్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా హాస్టల్ వెల్ఫేర్ అధికారుల(హెచ్‌డబ్ల్యూఓ) పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు త్వరలో కౌన్సెలింగ్ నిర్వహించి, పోస్టింగ్‌లు ఇస్తామని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ తెలిపారు. ఐటీడీఏలో సోమవారం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనను పీఓ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రాచలం జోన్‌కు 27 మంది అభ్యర్థులను పంపారని చెప్పారు. సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్ కమిటీ సభ్యుల సమక్షంలో అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసినట్లు పేర్కొన్నారు. పాఠశాలలు తెరిచే లోపల పోస్టింగ్‌లు ఇస్తామని తెలిపారు. అధికారులు మణెమ్మ, అనసూయ, ఇందిర, రమణయ్య, అశోక్ కుమార్, చంద్రమోహన్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవ కంపెనీలో కాంట్రాక్టర్ మృతి

పాల్వంచ: పట్టణంలోని నవ కంపెనీలో నీళ్లలో పడి ఓ కాంట్రాక్టర్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. టీచర్స్ కాలనీకి చెందిన ఉప్పల గిరీశం వెంకటేశ్వరరావు (60) నవ కంపెనీలో సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం పనుల పరిశీలనకు వెళ్లిన వెంకటేశ్వరరావు కూలింగ్ టవర్ వద్ద కాలు జారి పడిపోయాడు. దీంతో కొద్ది సేపటి తర్వాత గుర్తించిన ఉద్యోగులు అధికారులకు సమాచారం అందించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి ముగ్గురు పిల్లలు కాగా, వారు విదేశాల్లో ఉన్నారు. మృతుడి భార్య పుష్పలత ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేశారు.

'ఎల్లో టీ షర్ట్'లపై నిరసన



ఐటీసీ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీలో పర్మనెంట్ కార్మికులకు ఎల్లో కలర్ టీ షర్ట్‌లు ఇవ్వడంపై కార్మిక సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. సోమవారం కార్మిక సంఘాల నాయకులు ఐటీసీ అడ్మిన్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. గుర్తింపు కార్మిక సంఘం టీఎన్‌టీయూసీ నిర్ణయాలకు అనుగుణంగా, కార్మిక సంఘాలతో చర్చించకుండా.. ఐటీసీ యాజమాన్యం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్మికులందరూ ఎల్లో టీ షర్ట్‌లు తీసుకోకుండా నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఆందోళనలో కార్మిక సంఘాల నాయకులు గోనె రామారావు, సానికొమ్ము శంకర్‌రెడ్డి, మల్లికంటి వెంకటేశ్వర్లు, బిజ్జం అశోక్‌రెడ్డి, సింగనేని ప్రసాద్, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, అబ్దుల్ సలీమ్, సాబీర్ పాల్గొన్నారు.

ముగిసిన అంతర్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ఏన్కూరు: మండలంలోని గంగుల నాచారంలో మూడు రోజులు జరుగుతున్న ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ పోటీలలో 25 జట్లు పాల్గొనగా, ఏన్కూరు మండలం గంగుల నాచారం జట్టు విజేతగా నిలిచింది. ఆతర్వాత స్థానాల్లో సూరారం, గోలిమిల్లు, గంగుల నాచారం(బీ), పుఠానీ తండా, చెరువుమాదారం జట్లు నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముక్తి వెంకటేశ్వర్లు, మల్కం గంగులు, పూసం సుధీర్, మల్లేష్, భద్రయ్య, భీమరాజు, గోపాలరావు, వినోద్ కుమార్, సీతారాములు, వెంకటేశ్వర్లు, శివకృష్ణ, నాగార్జున, సాగర్, దినేష్, నరేష్ పాల్గొన్నారు.


మెరుగైన వైద్యం అందించండి

తిరుమలాయపాలెం: ప్రకృతి వైద్యం ప్రత్యేకతలను ప్రజలకు వివరిస్తూ మెరుగైన వైద్యం అందించాలని రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ప్రమీలాదేవి సూచించారు. తిరుమలాయపాలెంలోని ప్రకృతి వైద్యశాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఓపీ సేవలు, రికార్డులను పరిశీలించాక ఉద్యోగులకు సూచనలు చేశారు.

ప్రభుత్వాస్పత్రిలో బాలిక అదృశ్యం.. ఆచూకీ లభ్యం

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని ఏరియా ఆస్పత్రిలో ఏడేళ్ల బాలిక సోమవారం రాత్రి అదృశ్యమైంది. మణుగూరుకు చెందిన ఓ మహిళ భద్రాచలం ఆస్పత్రిలో పది రోజులుగా చికిత్స పొందుతోంది. ఆమె ఏడేళ్ల కుమార్తె కూడా ఆస్పత్రిలో ఆమెతోపాటే ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం వరకు ఆస్పత్రిలోనే ఉన్న ఆ బాలిక బ్లెస్సీ అదృశ్యం కావడంతో తల్లితోపాటు కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీనిపై సీఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టగా.. ఎట్టకేలకు రాత్రి పొద్దుపోయాక ఆచూకీ లభ్యమైంది. ప్రస్తుతం బాలిక పోలీసుల ఆధీనంలో ఉన్నట్లు తెలిసింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.21,000

నృత్యం.. కళారూపం

- వివిధ నృత్యరూపకాల్లో ఖమ్మం వాసుల ప్రతిభ
- పోటీల్లో రాణించడమే కాక ఇంకొందరికి శిక్షణ
- నేడు అంతర్జాతీయ నృత్య దినోత్సవం



ఏపీ మాజీ సీఎం రోశయ్య చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కళాకారులు, మాస్టర్ మోహన్‌రావు (ఫైల్)



నాట్యం చేస్తున్న మీనా

ఖమ్మంగాంధీచౌక్: కళారూపాల్లో ఒకటైన నృత్యం.. సాంస్కృతిక వ్యక్తీకరణకే కాక విద్యాసాధనంగానూ ఉపయోగపడుతోంది. అన్ని కళలతో నాట్యం ముడిపడి ఉండడంతో సమాహార కళగా పిలుస్తారు. ఈ కళా శాస్త్రాన్ని భరతముని అందించినట్లు చెబుతుండగా... సంగీతం మాదిరిగానే నృత్యం కూడా విశ్వవ్యాప్తమైంది. ఫ్రెంచ్‌కు చెందిన ప్రముఖ నృత్యకారుడు జీన్ జార్జెస్ నోవెర్రే జయంతి సందర్భంగా ఏటా ఏప్రిల్ 29న అంతర్జాతీయ నృత్యదినోత్సవంగా జరుపుకుంటున్నారు. అయితే, పలు దేశాల్లో నృత్యానికి చట్టపరమైన సూచనలు లేకపోగా, ప్రభుత్వాలు బడ్జెట్‌లో కేటాయింపులూ చేయడం లేదు. దీంతో ప్రభుత్వ సంస్థల్లో నృత్య విద్యకు ప్రోత్సాహం కొరవడింది.

నాగరికత ఆధారంగా నృత్యకళ

నాగరికతల ఆధారంగా నృత్యకళ రూపుదిద్దుకోగా.. కాలానుగుణంగా అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. దాదాపు రెండు వేల ఏళ్ల కిందటే నాట్య శాస్త్రం రూపుదిద్దుకుంది. మన దేశంలో వివిధ రకాల శాస్త్రీయ నృత్యరీతులు అందుబాటులో ఉన్నాయి. ప్రాంతాల వారీగా భరతనాట్యం, కథక్, కూచిపూడి, ఒడిస్సీ, కథాకళి, మణిపురి, మోహినీయాట్టం వంటివి గుర్తింపు పొందాయి. ఇక తెలుగు రాష్ట్రాల్లో పేరుగాంచిన కూచిపూడి, పేరిణి దేశవ్యాప్తంగానూ గుర్తింపు సాధించాయి. పేరిణి నృత్యం కాకతీయుల కాలంలో ప్రాచుర్యం పొందగా.. దీనికి తెలంగాణ నృత్యమని, యోధుల నృత్యమని పిలుస్తారు. యోధులు యుద్ధానికి వెళ్లే ముందు శివుడిని ఆరాధిస్తూ ఈ నృత్యం చేసే వారని ప్రతీతి.

కళల గుమ్మం.. ఖమ్మం

కళల గుమ్మంగా ఖమ్మంకు పేరు. ఈక్రమంలోనే వివిధ కళలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉండగా.. నాట్య కళకు మాత్రం ఆ పరిస్థితి కానరాదు. నాట్యం విద్యకు ముడిపడి ఉన్నప్పటికీ ప్రభుత్వ విద్యాసంస్థల్లోనూ ప్రాధాన్యత దక్కడం లేదు. అక్కడక్కడా ప్రైవేట్ సంస్థలు మాత్రం ఆసక్తి ఉన్న వారికి శిక్షణ ఇస్తున్నాయి. దీంతో పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించారు.

నృత్య పండిత 'మోహను'డు

కూచిపూడి నృత్యంలో ఖమ్మంకు చెందిన కే.జే.మోహన్‌రావు పేరుగడించారు. పదేళ్ల వయసులోనే కూచిపూడిలో ప్రావీణ్యం సాధించిన 53 ఏళ్లుగా ఎందరికో శిక్షణ ఇచ్చారు. 1981 నుంచి తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రదర్శనలు ఇచ్చినాయన ఇతర రాష్ట్రాల్లోనూ తన కళ ద్వారా గుర్తింపు పొందారు. ఖమ్మం బాలభవన్‌లో అనాథ పిల్లలకు నేర్పించిన ఆయన హైదరాబాద్ లలితకళా తోరణంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో 60 మంది అనాథ పిల్లలతో నృత్య ప్రదర్శన ఇప్పించారు. 1978లోనే నృత కళాభారతి సంస్థను ఏర్పాటుచేసి శిక్షణ ఇస్తున్నారు.

పేరిణి.. వీరూనాయక్

తెలంగాణ నృత్య కళారూపంగా భావించే పేరిణి నృత్యాన్ని జిల్లాలో వీరూనాయక్ తెరపైకి తీసుకొచ్చాడు. కూసుమంచిమండలానికి చెందిన ఆయన పదిహేనేళ్ల క్రితం పేరిణి నృత్యం నేర్చుకొని ఖమ్మంలో నృత్యాలయం ద్వారా పేరిణి శివతాండవంపై శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 500 మందికి శిక్షణ ఇవ్వగా.. అందులో పలువురు ప్రదర్శనల ద్వారా గుర్తింపు సాధించారు. ఇక వీరూనాయక్ స్వర్ణ కంకణ, సర్వ కళా ప్రతిభ, నంది అవార్డులతో పాటు కళారాధన, స్వర్ణనంది అవార్డులు పొందారు.



పేరిణి నృత్యం చేస్తున్న వీరూనాయక్ (కుడి నుంచి మొదటి వ్యక్తి)

నాట్యమయూరి 'మీనా'

ఖమ్మం నగరానికి చెందిన మీనాకు నాట్యంలో మంచి గుర్తింపు ఉంది. ఐదేళ్ల వయసు నుంచే అభ్యాసన ప్రారంభించిన ఆమె కూచిపూడిలో డిప్లొమా పూర్తి చేసి 12 ఏళ్లుగా వందలాది మంది చిన్నారులకు శిక్షణను ఇస్తున్నారు. ఆమె స్వతహాగా దేశంలోని పలు ప్రాంతాల్లోనూ కాక మలేషియా, సింగపూర్ తదితర దేశాల్లో ప్రదర్శనలు ఇవ్వడం విశేషం. మీనా నృత్య ప్రదర్శనలకునాట్యమయూరి, నాట్యకౌముది, తెలుగు తేజం, నాట్య గురురత్న, నాట్య శిరోమణి తదితర అవార్డులు గెలుచుకుంది.

మావోయిస్టులతో చర్చలు జరపాలి



మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) నాయకుడు ఆవునూరి మధు

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

సింగరేణి(కొత్తగూడెం): మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివాసీలను హననం చేసే ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, కర్రిగుట్టను చుట్టుముట్టిన కేంద్ర బలగాలను వెనక్కి రప్పించాలని కోరుతూ సోమవారం పలు రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కొత్తగూడెంలోని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక ఆదివాసీ ఉన్న చట్టాలను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. నూతన అటవీ సంరక్షణ నియమాల పేరుతో కొత్తచట్టాలను తీసుకొచ్చి ఆదివాసీల ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తోందన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో 89 రకాల ఖనిజ సంపద ఉందని, వాటిని స్వాధీన పరుచుకోవటం కోసం దాడులు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. 280 కిలోమీటర్ల వైశాల్యం కలిగిన కర్రి గుట్టను టార్గెట్ చేసుకుని 25 లక్షల సైన్యం జల్లెడ పడుతోందన్నారు. తక్షణమే వీరందరిని వెనక్కి పిలిచి శాంతి చర్చలు జరుపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిద పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జూద క్రీడలు ఆడితే చర్యలు

ఎస్పీ రోహిత్‌రాజు



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

దమ్మపేట: కోడి పందేలు, పేకాట, బెట్టింగ్ వంటి జూద క్రీడలు ఆడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ రోహిత్ రాజు ఆదేశించారు. సోమవారం ఆయన దమ్మపేట పోలీసు స్టేషన్‌ను సందర్శించి, పరిసరాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠా కదలికలపై నిఘా పెట్టాలన్నారు. అశ్వారావుపేట సీఐ నాగరాజు రెడ్డి, దమ్మపేట ఎస్సై సాయికిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

కోడలు ఇంటి ఎదుట వృద్ధురాలి నిరసన



కోడలు ఇంటి ఎదుట బైఠాయించిన వృద్ధురాలు

అశ్వారావుపేటరూరల్: కోడలు ఇంటి ముందు ఓ వృద్ధురాలైన అత్త బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన ఘటన సోమవారం జరిగింది. స్థానికులు, బాధితురాలి కథనం ప్రకారం.. మండల పరిధిలోని నారంవారిగూడెం కాలనీ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు మానుగొండ రాజాలు, సీతమ్మలకు ఏడెకరాల వ్యవసాయం భూమి ఉంది. కొన్నేళ్ల క్రితం తన కుమారుడు పుల్లారావుకు ఐదెకరాలు ఇచ్చారు. మిగిలిన రెండెకరాలు వృద్ధ దంపతులు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పదేళ్ల క్రితం కుమారుడు పుల్లారావు, రాజాలు మృతి చెందారు. ఆ తర్వాత సీతమ్మ తన కోడలుకు మరో ఎకరం కూడా ఇచ్చింది. కాగా ఆమెకు తెలియకుండా కోడలు రెండు ఎకరాలు కూడా పట్టా చేయించుకుంది. అనంతరం సక్రమంగా చూడకపోవడంతో అదే గ్రామంలో ఉన్న కుమార్తె తిరుపతమ్మ వద్ద ఉంటోంది. కుమార్తె ఆర్థిక పరిస్థితి కూడా సరిగ్గా లేకపోవడంతో జీవనం ఇబ్బందిగా మారినట్లు వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది. తన పొలం తనకు అప్పగించాలని కోరుతూ పోలీస్‌లను ఆశ్రయించగా, న్యాయం జరగకపోవడంతో కోడలి ఇంటి ముందు నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపింది. కోడలు ఇంటి ముందు మూడు గంటలకుపైగా బైఠాయించగా పట్టించుకోకపోవడంతో కుమార్తె వచ్చి వృద్ధురాలిని తిరిగి తన ఇంటికి తీసుకెళ్లింది. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని వృద్ధురాలు వేడుకుంటోంది.


చోరీ కేసులో ఏడాది జైలు శిక్ష

భద్రాచలంఅర్బన్: బైక్ చోరీ కేసులో ఇద్దరు ముద్దాయిలకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ సోమవారం భద్రాచలం ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తి శివనాయక్ తీర్పు చెప్పారు. దుమ్ముగూడేనికి చెందిన మట్టా వెంకటేశ్వర్లు అనే వ్యక్తి బైక్ సెప్టెంబర్ 4, 2022లో భద్రాచలంలో చోరీకి గురైంది. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితులు కారం కృష్ణమూర్తి, కేదాసి రాములుకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఏపీపీగా శ్రీనివాస్ వాదించగా, సీఐ నాగరాజు రెడ్డి, నరసింహా సహకరించారు.

రోడ్డు ప్రమాద కేసులో జరిమానా

కొత్తగూడెంటౌన్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెంది, ముగ్గురు గాయపడ్డానికి కారణమైన ఆటో డ్రైవర్ భూక్య రమేష్‌కు రూ.10,500 జరిమానా విధిస్తూ సోమవారం కొత్తగూడెం రెండో అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ తీర్పు చెప్పారు. వివరాలు ఇలా.. చుంచుపల్లి మండలం అల్బాతండాకు చెందిన తేజావత్ కావ్య తన భర్త విజయ్, తండ్రి బాలుతోపాటు మరికొందరు కలిసి ఆటోలో కొత్తగూడెం నుంచి జూలూరుపాడుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో బృందావనం సమీపంలో వెనుక అతివేగంగా వచ్చిన మరో ఆటో ఢీకొట్టింది. దీంతో ముందు ఆటోలో ఉన్న ప్రయాణికులు విజయ్, చింతలపూడి రత్నమ్మ, చింతలపూడి నాగేశ్వరావు, మూడు భావ్‌సింగ్‌లకు గాయాలయ్యాయి. విజయ్‌ను చికిత్స నిమిత్తం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడి భార్య కావ్య ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన ఆటోడ్రైవర్ భూక్య రమేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. కోర్టులో న్యాయమూర్తి ఎనిమిది మంది సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో రూ.10,500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున బి.విశ్వశాంతి వాదించగా, సిబ్బంది ఎస్.వీరబాబు, రామకృష్ణ సహకరించారు.


డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య



ప్రసన్న(ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ఉరి వేసుకుని డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం జరిగింది. ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. మండల పరిధిలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన తెల్లగొర్ల ప్రసన్న(20)పాల్వంచలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతోంది. నాలుగు రోజుల క్రితం పరీక్షలు రాసేందుకు పాల్వంచలోని కళాశాలకు వెళ్లింది. కాగా, పరీక్షలు వాయిదా పడటంతో తన తండ్రికి చెప్పగా, పరీక్షలు రాసిన తర్వాత ఇంటికి రావాలని చెప్పాడు. ఈ క్రమంలోనే ఇంటికి దూరం ఉండి చదువుకోవడం ఇష్టం లేక మనస్తాపం చెంది సోమవారం ఉదయం పాల్వంచ నుంచి ఇంటికి వచ్చేసింది. అప్పటికే తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లడంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి వెంకటరమణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



శ్రీను (ఫైల్)

టేకులపల్లి: కుటుంబంలో తలెత్తిన గొడవలు, వేధింపుల నేపథ్యంలో కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగిన ఘటనలో భార్య చనిపోగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భర్త కూడా సోమవారం మృతి చెందాడు. టేకులపల్లి ఎస్‌ఐ రాజేందర్ కథనం ప్రకారం.. మండలంలోని బేతంపూడి పంచాయతీ వెంకటియా తండాకు చెందిన బోడ శ్రీను(26) ఆరు నెలల క్రితం రేగులతండాకు చెందిన దీపిక(19)ను ప్రేమ వివాహం చేసుకున్నాడు. కాగా శ్రీను తన సోదరి వివాహానికి ఆర్థికసాయం కావాలని మామ వత్మల్, తోడల్లుళ్లు భర్మవత్ రవి, నాగేశ్వరరావులను అడిగాడు. వారు ఆర్థికసాయం చేయకపోగా దూషించారు. దీంతో మనస్తాపం చెంది ఈ నెల 24న శ్రీను, దీపికలు పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఈ నెల 25న దీపిక మృతి చెందింది. పరిస్థితి విషమించి సోమవారం శ్రీను కూడా మృతి చెందాడు. మృతుడి తండ్రి వీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు.

కొడుకు దాడిలో గాయపడిన తండ్రి..

గుండాల: మద్యానికి బానిసైన కుమారుడు దాడి చేయగా గాయపడిన తండ్రి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గుండాల సీఐ రవీందర్ కథనం ప్రకారం.. మండలంలోని తూరుబాక గ్రామానికి చెందిన ఈసం పోతయ్య (52) కుమారుడు స్వామి నిత్యం మద్యం తాగుతూ ఇంట్లో గొడవ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 21న తండ్రి, కొడుకుల మధ్య గొడవ జరిగింది. దీంతో కుమారుడు కర్రతో దాడి చేయగా, తండ్రి తలకు బలమైన గాయమైంది. అతన్ని ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పాల్వంచ: ఏడుగురు పేకాట రాయుళ్లను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణంలోని ఎస్సీ కాలనీ శ్మశాన వాటిక వద్ద పేకాట ఆడుతుండగా ఎస్‌ఐ సుమన్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. నిందితులను అరెస్ట్ చేసి, మోటార్ సైకిల్, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.3,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

ప్రయాణికులకు చేరువగా..

- క్యూఆర్ కోడ్‌తో ఆర్టీసీ సేవల వివరాలు
- కోడ్ ముద్రించిన కీచైన్లు, టేబుల్ క్యాలెండర్ల పంపిణీ



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ అధికారులు (ఫైల్) (ఇన్ సెట్) క్యూఆర్ కోడ్ ముద్రించిన టేబుల్ క్యాలెండర్

భద్రాచలంఅర్బన్: ఆర్టీసీ సంస్థ ఆధునిక సాంకేతికత అందిపుచ్చుకుంటోంది. క్యూఆర్(క్విక్ రెస్పాన్స్) కోడ్ ద్వారా సేవలందిస్తూ వినియోగదారులకు మరింత చేరవయ్యే ప్రయత్నం చేస్తోంది. క్యూఆర్ కోడ్ ముద్రించిన కీ చైన్, క్యాలెండర్లను కస్టమర్లకు ఉచితంగా పంపిణీ చేస్తోంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆర్టీసీ అందిస్తున్న పదిరకాల యాప్‌లు తెరపై కనిపిస్తాయి. ఆన్‌లైన్ బస్ టికెట్ బుకింగ్ వెబ్‌సైట్, గమ్యం, ఆన్‌లైన్ బుకింగ్ యాప్, ఆర్టీసీ ఇన్‌స్టాగాం, ఎక్స్, యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సప్ చానల్ ఖాతాలు ఉంటాయి. మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ తదితర వివరాలు పొందుపరిస్తే వినియోగించుకోవడం సులభమవుతుంది. సాధారణంగా ఫ్లెక్సీల రూపంలో, ఇతర విధానాల్లో ప్రచారం చేస్తే అంతగా చేరుతుందో లేదోననే కారణంతో ఆర్టీసీ అధికారులు క్యూఆర్ కోడ్‌తో ప్రచారం చేస్తున్నారు.

సేవలిలా..

క్యూఆర్ కోడ్ సాయంతో వివిధ రకాల సేవలు పొందొచ్చు. ప్రయాణించాల్సిన బస్సు ఎక్కడుంది? గమ్యానికి ఇంకా ఎంత సమయంలో చేరుకుంటుంది? వంటి వివరాలను తెలుసుకోవచ్చు. రాష్ట్రంలో నడుస్తున్న సంస్థ బస్సుల వివరాలు, సమాచారం లభిస్తుంది. ఆన్‌లైన్‌లో టికెట్లు రిజర్వ్ చేసుకోవచ్చు. సలహాలు, సూచనలతోపాటు, ఫిర్యాదులు ఇచ్చేందేకు ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, ఎక్స్ వేదికలను వినియోగించుకోవచ్చు. వివాహాది శుభకార్యాలతోపాటు విహార యాత్రలకు బస్సులను రాయితీ విధానంలో తక్కువ ధరకే బుకింగ్ చేసుకోవచ్చు.

ప్రయాణికులు సహకరించాలి



ప్రస్తుతం ప్రతీ ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటోంది. ఈ క్రమంలో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సంస్థకు సంబంధించిన అన్ని సేవలను ఒకే చోట పొందేలా ఏర్పాట్లు చేశాం. ఇది మరింత చేరువయ్యేందుకు కీచైన్లు, టేబుల్ క్యాలెండర్లు రూపొందించాం. ప్రయాణికులకు పంపిణీ చేస్తున్నాం. ప్రజలు సంస్థ ఉన్నతికి సహకరించాలి.

– తిరుపతి, డిపో మేనేజరు, భద్రాచలం

కేంద్రాల్లో రైతుల నిరీక్షణ

ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని ఆవేదన



ప్రభాత్‌నగర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు

పాల్వంచరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రాశులుపోసి నెల రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు సక్రమంగా జరగడంలేదు. దీంతో రైతులు నిరీక్షిస్తున్నారు. మండల పరిధిలోని రెడ్డిగూడెం కొనుగోలు కేంద్రంలో సుమారు వంద క్వింటాళ్లపైన ధాన్యం నిల్వలు ఉన్నాయి. రెండు రోజుల క్రితం ధాన్యం కొనుగోలు చేసి తర్వాత నిలిపివేశారు. సోములగూడెం కొనుగోలు కేంద్రం వద్ద శనివారం ధాన్యం కాంటా పెట్టారు. రెండు రోజులుగా కొనుగోళ్లను నిలిపివేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దంతెలబోరు, కారెగట్టు గ్రామాల్లో ఇంతవరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. రోజూ అడపాదడపా వర్షం కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా పీఏసీఎస్ సొసైటీ కార్యదర్శి శ్రీనును వివరణ కోరగా.. మిల్లర్లు కిరికిరి పెడుతుండటం, లారీలు అనుకున్న సమయంలో రాకపోవడం వల్ల రెగ్యులర్‌గా కొనుగోళ్లు జరగడంలేదని తెలిపారు.

అప్రెంటిస్‌లేక సింగరేణి ఉద్యోగానికి అనర్హత

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ నోటిఫికేషన్‌లో పూర్తి సమాచారం ఇవ్వని కారణంగా మెరిట్ ఉన్నా 18 మంది అభ్యర్థులు ఉద్యోగులకు అనర్హులవుతున్నారు. సింగరేణిలో 2024లో 86 ఎలక్ట్రీషియన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. గత ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో హైదరాబాద్‌లో పరీక్షలు నిర్వహించారు. పరీక్ష రాసి మెరిట్ సంపాదించిన అభ్యర్థులకు ఈ నెల 16న సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టారు. అభ్యర్థులు సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు హాజరు కాగా, అప్రెంటిస్‌షిప్‌లేదని 18 మంది అభ్యర్థులకు ఉద్యోగం ఇవ్వకుండా తిరస్కరించారు. డీజీఎంఎస్ గైడ్‌లైన్స్ ప్రకారం సింగరేణిలో ఉద్యోగానికి వన్‌ఇయర్ అప్రెంటిస్‌షిప్ ఉండాలని పేర్కొన్నారు. కాగా అప్రెంటిస్‌షిప్ లేదని తమకు హాల్‌టికెట్ ఇవ్వకపోతే వ్యయప్రయాసలు పడేవారం కాదని, తీరా పరీక్ష రాసి మెరిట్ సాధించాక తిరస్కరించడం సరికాదని అభ్యర్థులు వాపోతున్నారు. ఈ విషయమై సింగరేణి డైరెక్టర్ (పీపీ అండ్ పా) కే. వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. నోటిఫికేషన్‌లో ఇచ్చిన నిబంధనల ప్రకారం అభ్యర్థి సర్టిఫికెట్లు సబ్‌మిట్ చేయాలని, సర్టిఫికెట్ లేకపోతే ఉద్యోగం ఇవ్వటం సాధ్యంకాదని తెలిపారు.

ముక్కల గడ్డిని చుట్టేస్తోంది..!



గడ్డిని చుట్టేస్తున్న బేరల్ యంత్రం



కట్ట కట్టిన గడ్డిని ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న రైతు

కరకగూడెం: రైతుల వద్ద గడ్డి అందుబాటులో లేనప్పుడు పశుగ్రాసం కొరత ఏర్పడుతుంది. బేరల్ యంత్రంతో గడ్డి సమస్య కొంతమేర పరిష్కారం అవుతోంది. వరి కోసే సమయంలో ముక్కలైన గడ్డిని ఈ యంత్రం చుట్టచుడుతూ వృథా కాకుండా చూస్తుంది. వృథా గడ్డిని కాల్చడం ద్వారా ఏర్పడే వాయు కాలుష్యం సైతం తగ్గుతుంది. ఈ యంత్రం ద్వారా గడ్డిని గుండ్రంగా లేదా చతురస్రాకారంలో బేల్స్ తయారు చేయొచ్చని నిర్వాహకులు చెబుతున్నారు. బేరల్ యంత్రం తమకు ఎంతో ఉపయుక్తంగా ఉందని మోతె గ్రామ రైతు వలాద్రి రవీందర్‌రెడ్డి, రేగళ్లకు ఎందిన కొమరం పాపారావు చెప్పారు. ఈ యంత్రాల కొనుగోలుకు రైతులకు సబ్సిడీపై రుణం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ ఖమ్మం టౌన్, సాయి చైతన్యనగర్ ధంసలాపురం నందు 1500 చ.గ.ల స్థలం మరియు 1065 చ.గ.ల స్థలములు అమ్మకమునకు కలదు. సంప్రదించవలసిన ఫోన్ నెం. 9603706197 [G-154]

Wanted

■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA 25003066]

HOME TUTOR

■ Need Home Tutor to teach 10th Class Maths state syllabus for 2 months only. at Nehru Nagar, Khammam. Cont. Cell: 94900 12341 [SCA 25003044]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	9705444182
	9010299957
పాల్వంచ	9705444183
భద్రాచలం	9951602914
మణుగూరు	9705944416
సత్తుపల్లి	9652868642
మధిర	9949927792

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.